క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ విద్యా సంస్థలో ఆదివారం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఈ శిబిరంలో ఉదయం 9 గంటల నుంచి రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శృంగార వల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం రెండో శనివారం కావడంతో ఈ వారం వేల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామివారికి రూ.2,57,107 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. స్వామివారి దర్శనానినికి వచ్చిన భక్తులు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, భక్తులు పాల్గొన్నారు.

గోర్సలో వైఎస్సార్ పొలంబడి



గొర్సలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి జోగిరాజు

కొత్తపల్లి: రైతులకు పంటల సంరక్షణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏలు, వీహెచ్ఏదేనని మండల వ్యవసాయ అధికారి జోగిరాజు అన్నారు. మండలంలోని గొర్సలో శనివారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ జోగిరాజు మాట్లాడుతూ ఖరీఫ్ సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు, పురుగు మందులు ఉపయోగించాలన్నారు. గడ్డి మందును అధికంగా ఉపయోగించరాదన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక

పిఠాపురం: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నూతన కమిటీ ఎన్నిక శనివారం పిఠాపురంలో జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎ.గంగా సూరిబాబు, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సంఘ పిఠాపురం శాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బొమ్మిడి వెంకటేష్, కందవల్లి సిద్ధులు, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, లోవరాజు, శ్రీకాంత్, ప్రసన్న, సన్ను, శంఖర్, సహాయ కార్యదర్శులుగా శ్రీరామ్, చిన్ని, గణేష్, కమిటీ సభ్యులుగా భవాని, రాముడు, నారాయణ, యమిలి, రేష్మి, రమ్య, సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

భూముల రీ సర్వే పరిశీలన



కొత్తమూలపేటలో భూ సర్వేను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ భాస్కరరావు

కొత్తపల్లి: జగనన్న భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా చేస్తున్న సర్వే ద్వారా పల్లెల్లోన్ని గ్రామ కంఠం భూములను గుర్తిస్తున్నట్టు ఈఓపీఆర్డీ భాస్కరరావు తెలిపారు. మండలంలోని కొత్తమూలపేటలో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తొలి విడతగా కొమరగిరి, ఇసుకపల్లి, రమణక్కపేట, శ్రీరాంపురం, నాగులాపల్లి, కొత్తమూలపేట గ్రామాల్లో భూములను సర్వే చేస్తున్నామన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామ కంఠం భూములను గుర్తించడంతో పాటు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ



నాడు-నేడులో అభివృద్ధి చేసిన పులిమేరు పీహెచ్‌సీ



అధునాతన భవనంలో వైద్యసేవలు అందుతున్న ఏరియా ఆసుపత్రి భవనం

- ఇంటి ముంగిటలోనే వైద్య సేవలు
- అందుబాటులో అన్ని రకాల మందులు
- ప్రజల ఆరోగ్య సంరక్షణకు భరోసా ఇస్తున్న పీహెచ్‌సీలు

పెద్దాపురం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేపట్టిన నాటి నుంచి వైద్య రంగం కొత్త పుంతలు తొక్కింది. గతంలో పెద్దాపురం పట్టణంలో ఏరియా ఆసుపత్రి మినహా మరే ఆసుపత్రి నుంచి ప్రభుత్వ సేవలు అందిన దాఖలాల్లేవు. ప్రసుత్తం డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేరుతో మరో రెండు పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. సుమారు కోటి రూపాయలతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. అద్దె భవనాల్లో నడుస్తున్న పీహెచ్‌సీలకు సొంత భవనాల నిర్మించారు. మండలంలోని పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీలతో పాటు మిగిలిన గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్య సేవలందించే దిశగా చర్యలు చేపట్టింది. ఒక్కో విలేజ్ క్లినిక్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులతో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టి వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకున్నారు.



వైఎస్సార్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్

ఆదరణ అమోఘం

ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రాథమికంగా షుగర్, బీపీ, వాంతులు, విరోచనాలు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఇక్కడ 64 రకాల వైద్య సేవలతో పాటు 172 రకాల మందులు అందిస్తున్నారు. ఒక్కో ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఔట్ పేషెంట్స్ వస్తున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి పెద్దాపురం పరిసర ప్రాంతాల నుంచి సుమారు రోజుకు 100 నుంచి 120 మంది వరకూ ఓపీ ఉంటోంది. పెద్దాపురం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల వద్దకే వైద్యం

పెద్దాపురం పట్టణంలో ఏరియా ఆసుపత్రి, పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీలు మినహా మరే విధమైన వైద్య సేవలు లేవు. మందుల కొరత వేధించేవి. వైద్య పరీక్షలా అంతంతమాత్రం. ఇక ఆసుపత్రిల సౌకర్యాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంతమంచిది. ఇలా టీడీపీ హయాంలో పట్టణ వైద్య అనారోగ్యంతో గాడి తప్పింది. నేడు ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రికి అప్‌గ్రేడ్ అయ్యింది. అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు మరో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజల వద్దకే వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. 104 ద్వారా ప్రతి గ్రామంలో వైద్య సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో రెండు పీహెచ్‌సీలను నాడు-నేడు పథకం ద్వారా అధునాతన పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్ నిర్మాణాన్ని చేపట్టి గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువలో వైద్య సేవలందిస్తున్నారు.

ఆసుపత్రులివే..

- పెద్దాపురం అర్బన్, రూరల్‌లో పీహెచ్‌సీలు
- ఏరియా ఆసుపత్రి, రాజమహేంద్రవరం రోడ్డు
- అర్బన్ హెల్త్ సెంటర్, పాత ఆసుపత్రి వీధి
- డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం, శోభా థియేటర్ వీధి
- డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం, సినిమా సెంటర్
- డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పులిమేరు
- డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాండ్రకోట
- గ్రామీణ ప్రాంతాల్లో మరో 20 విలేజ్ క్లినికల ఏర్పాటు

అందుబాటులో అన్ని సేవలు



ప్రసుత్త ప్రభుత్వ హయాంలోనే అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. చిన్నపాటి జ్వరమొస్తే ప్రైవేట్ ఆసుపత్రిలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసే వారం. ఇప్పుడు అలా కాకుండా పెద్ద పెద్ద రోగాలకు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా 64 రకాల వైద్య సేవలను ఉచితంగా అందించడం మాములు విషయం కాదు.

– లక్కాకుల కృష్ణ, కాండ్రకోట, పెద్దాపురం మండలం

ప్రజలకు చేరువలో వైద్యం



సామాన్య ప్రజలందరి వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫ్యామిలీ డాక్టర్‌గా ప్రతి ఇంటికి వెళ్లి వైద్యం అందించే దిశగా అన్ని సేవలు అందిస్తున్నాం. మాములు సమయాల్లోనూ ఓపీ బాగా పెరిగింది. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి 24 గంటల వైద్యం అందిస్తున్నారు.

– డాక్టర్ పి.రాజేష్, పీహెచ్‌సీ వైద్యులు, పెద్దాపురం మండలం

ఆలయాల అభివృద్ధికి కృషి



పిఠాపురం ఇందిరా నగర్‌లో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం ఇందిరా నగర్‌లో నూతనంగా నిర్మించనున్న పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలైన ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బోను దేవ, బొజ్జా రామయ్య, బొజ్జా దొరబాబు, వులవల భూషణం, మమ్మిడి శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే ఆహా క్యాంటీన్లు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురంలో ఆహా క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: నిరుపేదల ఆకలి తీర్చడానికే ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద వైఎస్సార్ చేయూత, ఆసరా ఆర్థిక సహాయంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు అందుబాటులో ఉండే విధంగా ఆహా క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారన్నారు. పేదలకు ఇక్కడ తక్కువ ధరకే అల్పాహారం, భోజనం అందిస్తారన్నారు. తొలిరోజు తన సొంత నగదుతో మొత్తం భోజనాలను కొనుగోలు చేసిన ఆయన పేదలకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

బతుకు బండిపై కూతురి భవిష్యత్తు



ఐస్‌క్రీం బండిపై కూతురిని కాలేజీకి తీసుకువెళుతున్న లక్ష్మణస్వామి

పిఠాపురం: ఆ కుటుంబానికి ఐస్ క్రీం బండే జీవనాధారం. తన కూతురును తనలా కాకుండా ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలన్నదే ఆ తండ్రి ధ్యేయం. దీంతో నిత్యం తన గారాల పట్టిని ఐస్ క్రీం బండిపై కాలేజీకి తీసుకువెళ్లి తీసుకువస్తుంటాడు. వివరాల్లోకి వెళితే... కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లికి చెందిన వాసంశెట్టి లక్ష్మణస్వామికి ఇద్దరు కూతుర్లు. ఆయనిది నిరుపేద కుటుంబం కావడంతో ఇద్దరు కూతుర్లలో పెద్ద పాపకు వివాహం చేయగా చిన్న కుమార్తెను చదివిస్తున్నాడు. ఐస్‌క్రీం బండి నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే అతను తన కూతురు కాలేజీకి నడిచి వెళ్లడం ఇష్టం లేక బతుకు బండిని కూతురు భవిష్యత్తుకు బాటలు వేసేదానిగా మార్చుకున్నాడు. ప్రతిరోజూ ఉదయాన్నే వ్యాపారానికి బయలు దేరేటప్పుడు తనతో పాటు తన బండిపై కూతురుని తీసుకెళ్లి కాలేజీ దగ్గర దింపుతున్నాడు. అదే కాలేజీతో పాటు చుట్టు పక్కల ఐస్ అమ్ముకుంటూ సాయంత్రం వ్యాపారం అయిపోగానే తిరిగి కాలేజీకి వచ్చి బండిపై కూతురిని ఇంటికి తీసుకువెళతాడు. ఇటు బతుకుదెరువు చూసుకుంటూ అటు కూతురు చదువుకు సహకరిస్తున్నాడు.

మదర్ థెరిసాకు నివాళి



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: మదర్ థెరిసాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు అన్నారు. మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉజా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్ నేతల హరిబాబు, క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు నిబద్ధత, నిజాయితీతో మెలగాలి

కలెక్టర్ కృతికా శుక్లా



అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సమాజానికి సేవ చేసే అవకాశం లభించిందని, విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో వ్యవహరించి ఉద్యోగ రీత్యా అంచెలంచెలుగా ఎదగాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా కొత్తగా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ అభ్యర్థులతో మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి సంబంధించి ఏపీపీఎస్సీ ద్వారా రెవెన్యూ శాఖలో కొత్తగా ఎంపికైన జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్లకు శనివారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. అభ్యర్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో కొత్తగా ఎంపికైన ఉద్యోగులు విధుల్లో భాగంగా అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పని చేయాలని, ఏవైనా సందేహాలుంటే సీనియర్ల నుంచి సూచనలు తీసుకోవాలన్నారు. వివిధ దస్త్రాలకు సంబంధించి అవగాహన పెంచుకోవాలన్నారు. శనివారం జరిగిన ప్రక్రియలో కాకినాడ జిల్లాకు 20 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 20 మంది, తూర్పుగోదావరి జిల్లాకు 10 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆరుగురు అభ్యర్థులను కేటాయించారన్నారు.

వనదుర్గ అమ్మవారి జాతర ప్రారంభం



బాలా త్రిపురసుందరి అలంకరణలో వనదుర్గ అమ్మవారు



వేలంకలో వేంచేసిన ముంగర్లమ్మ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం నిర్వహించి జాతర మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. నవధాన్యాలతో మండపారాధన, కలశస్థాపన చేశారు. 44 మంది రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ అమ్మవారికి రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 31 వరకూ ఈ జాతర మహోత్సవాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

ఘనంగా ముంగర్లమ్మ జాతర

కిర్లంపూడి: వేలంకలో వేంచేసిన ముంగర్లమ్మ అమ్మవారి జాతర శనివారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాణసంచా కాల్పులు, గలగల నృత్యాల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. స్థానిక, పరసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల' సందర్భంగా శనివారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్, గంగాధరబట్ల శర్మ, ప్రయాగ రాంబాబు, నర్సింహమూర్తి, చెల్లపిళ్ల ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్ తదితరులు హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రత్నగిరిపై అపరాజిత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అపరాజిత అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై రామాలయం పక్కన శమీవృక్షం (జమ్మి చెట్టు) వద్ద శనివారం అపరాజిత అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు గొల్లపల్లి ఘనపాఠి మాట్లాడుతూ కురుక్షేత్రం యుద్ధానికి ముందు పాండవులు తమ ఆయుదాలను శమీ వృక్షం మీద దాచి ఉంచారన్నారు. శమీ వృక్షం వద్ద అపరాజిత అమ్మవారు కొలువై ఉంటారని, ఆ అమ్మవారిని ప్రార్థించి పాండవులు కురుక్షేత్రంలో విజయం సాధించారని తెలిపారు. ప్రతి కార్యానికి ముందు జమ్మిచెట్టుతో పాటు అపరాజిత అమ్మవారికి ప్రదక్షిణ చేసి దర్శిస్తే విజయం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, వ్రతపురోహితులు నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వసతుల కల్పనకు చర్యలు



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడిన ఆయన ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పచ్చిమళ్ల అప్పలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'నెక్కంటి'ని కలిసిన షేక్ బషీర్



సాయిప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన బషీర్

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా కమిటీ సభ్యులుగా నియమితులైన షేక్ బషీర్ శనివారం పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో తన కష్టాన్ని గుర్తించిన ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, వీసీ సాయి ప్రసాద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొలుత సామర్లకోటలోని క్యాంపు కార్యాలయంలో దొరబాబును కలిసి పుష్ప గుచ్ఛమందించి కృతజ్ఞతలు తెలుపగా జిల్లా కమిటీ సభ్యుడిగా నియమితులైన బషీర్‌ను పలువురు అభినందించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా నేరం



పెద్దాపురం సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు

పెద్దాపురం: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా శిక్షార్హులని పెద్దాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జ్ బుల్లెమ్మ తెలిపారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ చట్టాల అంశంపై బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మడికి రాంబాబు, రాగం కామేశ్వరరావు, ఎస్.విశాలక్ష్మి, విజయలక్ష్మి, సరస్తి, చంటి పలువురు ఉన్నారు.

నాగదేవత పూజకు పుట్ట నిర్మాణం



జి.మేడపాడులో నిర్మించిన నాగుల పుట్టను తిలకిస్తున్న భక్తులు

సామర్లకోట: నాగదేవతను పూజించడానికి మండల పరిధిలో పుట్ట లేకపోవడంతో ఆ గ్రామానికి చెందిన భక్తులు శనివారం పుట్టను నిర్మించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ దీపావళి తరువాత వచ్చే నాగులచవితి రోజున పుట్టను పూజించడం జరుగుతుందని తెలిపారు. అయితే పొలాలోనికి వెళ్లినా పుట్టలు లేకపోవడం వలన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని కనకదుర్గ ఆలయ ప్రాంగణంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో నాగుల పుట్టు నిర్మించారన్నారు. పుట్ట నిర్మాణానికి శెట్టి అప్పారావు, రవణమ్మ దంపతులు ఆర్థిక సహాయం అందజేశారని గ్రామస్తు లు తెలిపారు. పుట్టను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి పూజలు చేశారు.

రైలు కిందపడి పెయింటర్ ఆత్మహత్య

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం శివారులో రైలు కింద పడి ఓ పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రాక్‌పై మృతదేహం రెండు ముక్కలుగా పడి ఉండటాన్ని రైల్వే పోలీసులు శనివారం ఉదయం గుర్తించారు. సమీపంలో ఫోన్ నంబర్లుతో కూడిన ఓ పుస్తకం పోలీసులకు లభించింది. దీని ఆధారంగా మృతుడి వివరాలను సేకరించగా, మృతుడిని తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన శిరిగి శివరామకృష్ణ (44)గా శనివారం రాత్రి గుర్తించారు. మృతుడు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడని, 20 ఏళ్ల క్రితం వివాహమైందని పోలీసులు తెలిపారు. మృతుడు కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పనులకు వెళ్లడం లేదు. దీంతో రెండేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. శివరామకృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.